క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చెక్ పంపిణీ



చెక్ అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆటో ప్రమాదంలో మృతి చెందిన నగరవాసి కె.విజయకుమార్ కుటుంబానికి ఎస్‌బీఐ చెక్‌ను అందజేసింది. ఎస్‌ఆర్‌పేట బ్రాంచ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రమాద బీమా కింద మంజూరైన రూ.10 లక్షల చెక్‌ను కర్నూలు రీజినల్ మేనేజర్ ఎంవీ సూర్యప్రకాశ్.. బాధితుడి భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అతి తక్కువ మొత్తంతో చేసే ప్రమాదబీమా అనుకోని ఘటన జరిగినపుడు బాధిత కుటుంబాలకు పెద్ద ఊరట ఇస్తుందన్నారు. ఎస్‌బీఐలో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ రూ.500 లేదా రూ.1000 చెల్లించి ప్రమాద బీమా పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పేట బ్రాంచ్ మేనేజర్ రాజేష్‌కుమార్, జనరల్ ఇన్సూరెన్స్ మాడ్యుల్ మేనేజర్ ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధినిర్ధారణకు రోగులను బయటకు పంపొద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వ్యాధినిర్ధారణ పరీక్షల కోసం రోగులను బయటి ల్యాబ్‌లకు పంపితే సంబంధిత వైద్యులు, పీజీలు, నర్సులపై చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. చిన్నపిల్లల విభాగం, గైనిక్, డైట్, ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్, ఇతర విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. చిన్నపిల్లలు, గైనిక్ విభాగాల్లో అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. ఏబీజీ టెస్టింగ్ మిషన్‌ను 24 గంటల పాటు ఏఎంసీలో అందుబాటులో ఉంచాలన్నారు. స్కానింగ్ రిజిస్టర్‌ను పరిశీలించి, వీలైనంత త్వరగా రోగులకు రిపోర్ట్‌లు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ ఉన్నారు.

బీసీలకు రాజకీయ మార్గదర్శకులు వైఎస్ జగన్



మాట్లాడుతున్న దేవపూజ ధనుంజయ ఆచారి

కర్నూలు(అర్బన్): బీసీ కులాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ మార్గదర్శకులని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి అన్నారు. మంగళవారం బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 బీసీలకు కేటాయించడం దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని కులాలకు పదవులను కేటాయించడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో బడుగు, బలహీన వర్గాలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటాయన్నారు. సమావేశంలో కుల సంఘాల నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య, ధనవిజయుడు, మద్దిలేటిస్వాములు,నారాయణగౌడ్,గిరీష్ పాల్గొన్నారు.

వడ్డెర్ల భగీరథుడు వైఎస్ జగన్..

వడ్డెర్లకు చట్టసభల్లో ప్రవేశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్..వడ్డెర్లకు భగీరథుడని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. బీసీ భవన్‌లో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు సురేంద్ర, గిరి, ఈశ్వర్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్‌లో సత్తాచాటాలి

కర్నూలు (టౌన్) : ఈనెల 24 నుంచి 26 వరకు గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ సాయి (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటాలని ఖేలో ఇండియా కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ పి.వి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో హ్యాండ్ బాల్ జట్టును ఆయన అభినందించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: పఠాన్, వాల్తేరు వీరయ్య, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ

వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ

వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ

ఐనాక్స్: పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్

భరత్ కాంప్లెక్స్ : పఠాన్, మేఖేల్, షెహ్జాదా

రాజ్ : వినరో భాగ్యము విష్ణు కథ

శ్రీరామ: యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా

విజయ: సార్

నిత్యసాహితీ హాలికుడు వెంకటకృష్ణ

- మాతృభాషలో సాహితీ సేద్యం
- పది కవిత, నాలుగు కథా సంకలనాలు ముద్రించిన ప్రభుత్వ ఉద్యోగి
- రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాల స్వీకరణ



వెంకట కృష్ణ రచనలు

కర్నూలు కల్చరల్: స్వతహాగా సామాజిక స్పృహ ఉండటం.. కష్టజీవులు, రైతుల కష్టాలను దగ్గరి నుంచి చూడటం ఆయన రచయితగా, సాహితీ వేత్తగా, సాహిత్య విమర్శకునిగా రాణించేందుకు దోహదపడ్డాయి. రాసే ప్రతి కవిత, కథలో రాయలసీమ ప్రాంత సమస్యలు, రైతుల కష్టాలను ఆయన ఇతివృత్తంగా ఎంచుకున్నారు. విభిన్న సాహితీ రచనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని తెలుగు యూనివర్సిటీ పురస్కారానికి ఎంపికయ్యారు వెంకటకృష్ణ. వృత్తి సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్. ప్రవృత్తి సాహిత్య రచన. ఆయన సాహిత్య సేవ గురించి 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కుటుంబ నేపథ్యం..

అనంతపురం జిల్లా గోరంట్ల మండలం బూడిదపల్లి గ్రామంలో 1964 ఏప్రిల్ 28న లక్ష్మీదేవమ్మ, వెంకటస్వామి (ఉపాధ్యాయుడు) దంపతులకు వెంకటకృష్ణ జన్మించారు. కల్యాణదుర్గం మండలం బెస్తర్ల పల్లిలో పదోతరగతి, కల్యాణదుర్గంలో ఇంటర్, బెంగళూరులో బీఏ డిగ్రీ చదివారు.అనంతపురం ఎస్‌కేయూలో ఎంఏ., ఎంఫిల్ పూర్తి చేశారు. బెంగళూరు లో ఉన్నపుడే ఆంగ్ల సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. 1992లో ప్రొఫెసర్ సుభాషిణిని ప్రేమ వివాహం చేసుకున్నారు. దంపతులు ఇద్దరూ రచయితలు కావడం విశేషం. హిందూపురంలో కొద్దికాలం అధ్యాపకుడిగా పనిచేశారు. 1989లో కదిరిలో గ్రామ వికాస అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1993 నుంచి కర్నూలులో ఉంటున్నారు. 1995లో సహకార శాఖలో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం కర్నూలు డివిజినల్ సహకార అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కవితా సంపుటాలు

లోగొంతుక (2000), దున్నెకొద్దీ దుఃఖం (2005), నదీ వరదా మనిషీ (కర్నూలు నగరాన్ని ముంచిన వరద మీద దీర్ఘ కవిత- 2009), కొన్ని రంగులూ ఒక పద్యం (2010), హంద్రీగానం (రాయలసీమ ఉద్యమ కావ్యం 2015), చినుకు దీవి (2016), కంచెదాటే పాట (2022)

కథా సంపుటాలు

గరుడ స్తంభం(2002), చిలుకలు వాలిన చెట్టు (2010), దేవరగట్టు (2017)

అందుకున్న ప్రముఖ పురస్కారాలు

- 2011లో కొన్ని రంగులు ఒక పద్యం కవితా సంపుటికి సి.నారాయణరెడ్డి కవిత్వ పురస్కారంతో పాటు ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం అందుకున్నారు.
- 2018లో దేవరగట్టు కథా సంపుటికి చిలుకూరు దేవ పుత్ర కథా పురస్కారం స్వీకరణ.
- దేవర గట్టు కథా సంపుటికి తెలుగు యూనివర్సిటీ కథా పురస్కారం -2020కు ఎంపిక. త్వరలోనే తెలుగు యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాన్ని స్వీకరించనున్నారు.

సమాజాన్ని జాగృతం చేయాలి



చేసే రచన ఏదైనా సమాజాన్ని జాగృతం చేసేలా ఉండాలి. అందుకు సామాజిక సమస్యల్ని వస్తువుగా తీసుకుని కవిత్వం, కథలు రాయాలి. వృత్తి ప్రభుత్వ అధికారి అయినా నావంతు బాధ్యతగా కవిత్వం, కథలు రాస్తూ కొంత వరకు సమాజాన్ని చైతన్య పరుస్తున్నాను. అనుకుంటున్నాను. తెలుగు యూనివర్సిటీ పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– వెంకట కృష్ణ, సాహితీ వేత్త

పరిష్కారాలతో అర్జీదారులను సంతృప్తి పరచండి

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): స్పందనలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారాలు చూపి అర్జీదారులను సంతృప్తి పరచాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు మండల స్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు పదేపదే స్పందన కార్యక్రమానికి రాకుండా సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపై ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు దృష్టిసారించాలన్నారు. సచివాయాల్లో సేవలను విస్తృతం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను శనివారంలోపు ఆమోదం తెలపాలని పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలకు సూచించారు. ఎంపీడీఓల లాగిన్‌లో ఉన్న కల్యాణమస్తు-షాదీతోఫా దరఖాస్తులపై త్వరగా విచారణ జరపాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఆరోగ్య కార్యకర్తల ద్వారా అందించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి పనులు పూర్తయితే బిల్లులు పోర్టల్ అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి రూఫ్ కాంక్రీట్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. హౌసింగ్‌లో ప్రతీరోజూ పురోగతి వచ్చేలా చూడాలన్నారు. స్పందనకు సంబంధించిన 1902 కాల్ సెంటర్, ఇతర మాధ్యమాల ద్వారా వచ్చిన అర్జీలు మరోసారి రాకుండా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డీపీఓ నాగరాజునాయుడు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం



సిల్వర్‌జూబ్లీ కళాశాలలో తెలుగు తల్లి చిత్ర పటం వద్ద ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కర్నూలు సిటీ: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ పాల్గొని తెలుగు తల్లి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నిత్యజీవితంలో మాతృభాష ద్వారా మనం అనుకున్న విజయాలు సాధించవచ్చన్నారు. మన వ్యక్తిత్వవికాసానికి వృద్ధికి మాతృభాష కంటే మించిన ఆయుధం లేదన్నారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ ప్రసాద్ రెడ్డి, తెలుగు శాఖ అధ్యక్షురాలు డా.ఫామిదా బేగం, తెలుగు అధ్యాపకులు డా.వెంకటలక్ష్మమ్మ, డా.అనుషా, సుధారాణి, డా.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: మాతృభాష మధురమైందని తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ ఆర్కే శర్మ అన్నారు. రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఓల్డ్‌సిటీలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలో సంస్కృతి, పద్యం, అవధానం లాంటి విశిష్టతలు ఉన్నాయన్నారు. రంగం రాష్ట్ర అధ్యక్షులు కరుణాకర్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు రమణ మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు మంజునాథ్, ఆనంద్, గంగాధర్, పుల్లయ్య, శ్రీవాణి, జ్యోతి పాల్గొన్నారు.

– దిన్నెదేవర పాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు కళ్లం సాహితీ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా జరిగింది. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఆదవాని హనుమంతప్ప హాజరై మాట్లాడారు. సమితి అధ్యక్షులు డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు చక్రపాణిరెడ్డి, సభ్యులు మీసాల రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రీడలు అవసరం

కర్నూలు(టౌన్): విద్యార్థి దశలో క్రీడలు అవసరమని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. స్థానిక సంకల్‌బాగ్‌లోని చిన్మయ విద్యాలయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నగరస్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో చిన్మయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన అంతర్ పాఠశాలల ఫుట్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు రాజశేఖర్, చీఫ్ కోచ్ రాజు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన గ్రామీణ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. మార్చి నెల 6వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు నాలుగు పాస్ ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాతో పాటు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో దరఖాస్తులను కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న తమ శిక్షణ సంస్థలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90007 10508 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

నలుగురికి ఏఐసీసీలో చోటు

కర్నూలు(సెంట్రల్) : ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) సభ్యులుగా నలుగురికి స్థానం లభించింది. కర్నూలు, నంద్యాల డీసీసీ అధ్యక్షులుగా ఉన్న ఎం.సుధాకరబాబు, లక్ష్మీనరసింహయాదవ్, పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న నాగమధుయాదవ్, నందికొట్కూరుకు చెందిన అశోకరత్నం ఎంపికయ్యారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున ఏఐసీసీలోకి తీసుకున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

మండలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

– ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): శాసన మండలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచించారు. మంగళవారం స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నిరుద్యోగ సమస్యను దృష్టిలో పెట్టుకొని అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత ఆయనదే అన్నారు. ప్రతి పథకాన్ని అర్హులైన పేదలకు అందించాలనే లక్ష్యంతోనే సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారని, ఇందులో కోసం గ్రామ/వార్డు సెక్రటరీలు, వలంటీర్లను తెచ్చారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన చరిత్ర సీఎం జగన్‌దే అన్నారు. పథకాల అమలులో ఎలాంటి కుల మతాలు, రాజకీయాలకు తావు లేకుండా అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. ఈ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. దీంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. శాసన మండలి ఎన్నికలు వస్తుండడంతో చేసిన మంచిని ప్రతి ఇంటికి వెళ్లి యువతకు వివరించాలన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితులకు జైలు, జరిమానా

కర్నూలు(లీగల్): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త, అత్త, మామలతో సహా నలుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ టి.జ్యోత్స్నదేవి మంగళవారం తీర్పు చెప్పారు. స్థానిక నిర్మల్ నగర్‌కు చెందిన సయ్యద్ నసీమ్ సుల్తానాను 2009 సెప్టెంబర్ 29న కర్నూలుకు చెందిన సయ్యద్ ముజీబ్ పాషా వివాహం చేసుకున్నాడు. పెళ్లి సమయంలో రూ.6 లక్షల నగదు, 20 తులాల బంగారంతో పాటు రూ.5 లక్షలు విలువ చేసే జీహేజ్ ఇంటి సామగ్రిని కట్నంగా ఇచ్చారు. కాగా పెళ్లైన కొంతకాలానికే భర్త, అత్త, మామ, మరిది కలిసి అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకే దిశ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో సయ్యద్ ముజీబ్ బాషా, సయ్యద్ తస్లీమ్‌భాను, సయ్యద్ తయాబ్, సయ్యద్ తాహీర్‌లకు రెండేళ్ల జైలు శిక్ష,రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

విద్యుత్ శాఖ ఎస్ఏఓగా రాఘవులు



కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు సర్కిల్ (జిల్లా) సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా జేసీ రాఘవులు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ రెగ్యులర్ అధికారిగా విధులు నిర్వహించిన డి.అన్వర్‌బాషా గత నెల 31న స్వచ్ఛందంగా పదవీ విరమణ తీసుకున్నారు. దీంతో వైఎస్ఆర్ జిల్లా ఎస్ఏఓగా పనిచేస్తున్న రాఘవులను ఇక్కడికి బదిలీ చేయడంతో ఆయన మంగళవారం విద్యుత్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు.



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌పీఎస్ నేతలు

బీసీల పక్షపాతి జగన్

కర్నూలు (అర్బన్): రాజకీయ పదవులు కట్టబెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతిగా నిలుస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.సుభాషచంద్రబోస్ అన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను వాల్మీకి/బోయ సామాజిక వర్గానికి కేటాయించడం పట్ల వీఆర్‌పీఎస్ నేతలు మంగళవారం మహర్షి వాల్మీకి, మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాలకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు చేశారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ సామాజిక న్యాయం పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర వర్గాలకు పదవులిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ నేతలు మురళీనాయుడు, శ్రీనివాసులు, మల్లేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

కర్నూలు కల్చరల్: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏక్యాంప్ మాంటిస్సోరీ పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల విద్యార్థులు, 17వ వార్డు యువత రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు కేజీ గోవింద రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రామచంద్రరావు, సేవా సమితి గౌరవ అధ్యక్షులు కేవీ సుబ్బారెడ్డి, జోగి వెంకటరామిరెడ్డి, అధ్యక్షులు విజయమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డిలు సర్టిఫికెట్లు అందజేశారు.

నగరపాలక ఏఈగా నాగజ్యోతి

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగానికి మరో అసిస్టెంట్ ఇంజినీర్‌ను నియమించారు.అనంతపురం నగరపాలకసంస్థలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నాగజ్యోతిని కర్నూలు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేస్తూ మంగళవారం సాయంత్రం ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆనందరావు ఉత్తర్వులు జారీ చేశారు.

భక్తిశ్రద్ధలతో విష్వక్సేన ఇష్టి





విగ్రహ ప్రతిష్ఠలో పండితులు, పూజల్లో త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, రుత్వికులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాల పాడు సమీపంలోని గోదా గోకులంలో మార్చి 1న నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం విష్వక్సేన ఇష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. యాగశాల ద్వారతోరణ ధ్వజ, కుంభారాధన, బాలభోగ నివేదన, విష్ణు సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు పద్మశ్రీ, రమణ, బాలస్వామిల సంకీర్తనల ఆలాపన అలరించాయి. వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, ఇల్లూరి రామయ్య, బాలసుధాకర్, చిత్రాల వీరయ్య, భూమా కృష్ణ మోహన్, వేముల జనార్దన్, రవి ప్రకాష్, తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ మల్లు వెంకటరెడ్డి, గోకులం పరివారం పాల్గొన్నారు.



ముస్తాబైన గోదా గోకులం



విష్వక్సేన ఇష్టి హోమాల్లో భక్తులు

జేసీ రాంసుందర్‌రెడ్డికి మాతృవియోగం

- రోడ్డు ప్రమాదంలో మృతి.. నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, కర్నూలు కలెక్టర్



కాంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులు, పక్కనే జేసీ రాంసుందర్‌రెడ్డి

చాపాడు: కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి తల్లి శెట్టిపల్లె కాంతమ్మ(73) సోమవారం రాత్రి మృతి చెందారు. చాపాడు మండలం నక్కలదిన్నెలో నివాసం ఉంటున్న కాంతమ్మ సోమవారం మధ్యాహ్నం బైక్‌పై నుంచి దిగే క్రమంలో ప్రమాద వశాత్తు కింద పడి గాయపడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ క్రమంలో మంగళవారం స్వగ్రామమైన నక్కలదిన్నెలో కాంతమ్మ మృతదేహం వద్ద సమీప బంధువు మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, సతీమణి ప్రభావతమ్మ, కర్నూలు జిల్లా కలెక్టర్ కోటేశ్వరావు, డీఐజీ సెంథిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను పర్యవేక్షించాలి



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మంగళగిరి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ ద్వారానే ప్రతి ఒక్కరూ హాజరు వేయాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి కేటాయించిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామాలను సందర్శించి రెండు పూటలా వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు వారి పరిధిలోని హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు తగిన ఆరోగ్యసేవలు అందించాలన్నారు. గర్భిణులు, కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి తగిన చికిత్సలు అందించి, వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో నమోదు చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వే వీలైనంత త్వరగా పూర్తి చేసి, వైద్యం అందించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ భాస్కర్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, మలేరియా అధికారి నూకరాజు, డీపీహెచ్ఎన్ఓ లిన్నెట్ లిడియా, ఎస్ఓ హేమసుందర్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

కర్నూలు కల్చరల్: స్థానిక ఏక్యాంప్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షులు విజయమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు.